# జీవితం చేజారింది

పానకాలరావు గ్లాసుమీద గ్లాసు లాగిస్తున్నాడు. అతనికున్న సమస్యల్లా బిల్లు ఎలా చెల్లించాలని. నిన్నటిదాకా సంతోషంగా ఖాతా పెట్టిలా అంగీకరించిన షాపు యజమాని నేడు రొక్కం కట్టమంటున్నాడు మరి.

"ఎంతమంది బిల్లు?" బేరర్ రాగానే అడిగాడు.

"నూరు రూపాయలు." చెప్పాడు అతను.

"వంద - సరే - రేపిస్తా!" తూలుతూ లేచి బయటికి పోబోయాడు పానకాలరావు.

"చూడు పానకాలరావు - బిల్లు చెల్లించి మరీ కదులు." ప్రొప్రయిటర్ కోటయ్య నొక్కి చెప్పాడు.

"కోటయ్యగారు - నా ఖాతాలో రాసుకోండి - రేపిస్తా -" బ్రతిమాలాడాడు.

"చూడు - రేపు అన్నది ఎప్పటికీ రాదు - ముందే చెప్పానుగా క్యాష్ ఉంటేనే మందు కొట్టు - లేకపోతే ఈ ఛాయలకు రావద్దని - అప్పుడే మర్చిపోయావా?" కసిరాడు కోటయ్య.

"సారీ! ఇరవయ్యే ఉంది. జేబులో బిల్లు కొంచెం ఎక్కువైంది. సంజాయిషీ యిచ్చుకున్నాడు.

"సరేలే-ఆ చొక్కా యిప్పేసి అక్కడ పెట్టిపో" తాపీగా చెప్పాడు.

"కోటయ్య! ఇది అన్యాయం! ఈ బారులో వేలకు వేలు బిల్లు చెల్లించాను - మర్చిపోయావా? నా జీతం అంతా యిక్కడే తగలేశాను - గుర్తుందా? నా పొలం అమ్మి తెచ్చిన యాభైవేలు ఈ బారుకే కట్టాను. ఇంతలోనే నా మీద నమ్మకం పోయిందా?" కళ్ళింబడి నీళ్ళు నింపుకున్నాడు.

కోటయ్య కుంగి పోయాడు - చిన్నగా చెప్పాడు. అదికాదు పానకాలరావు - నీలాంటి కష్టమరే ఒకడు నిన్న హరీమన్నాడు. అతను పెట్టిన బాకీ ఇరవైవేలు. అతనితోనే హరీ అంది - అందుకని నేనెవరినీ నమ్మదల్చుకోలేదు!"

"ఎవడు వాడు?" కుతూహలంగా అడిగాడు.

"రాజశేఖర్" నిర్లిప్తంగా చెప్పాడు కోటయ్య.

"ఆ! రాజశేఖరా?" బిగుసుకుపోయాడు పానకాలరావు.

"అవును. నీకు ఒకప్పటి ఫ్రెండు కదూ - మర్చేపోయాను - పోయి చూసి రా-" వ్యంగ్యంగా సలహా యిచ్చాడు.

"ఎలా జరిగింది." భారంగా అడిగాడు - మత్తు దిగిపోసాగింది.

"తెలీదు - నువ్వే కనుక్కొచ్చి మాకు చెప్పాలి." అన్నాడు కోటయ్య.

* * *

రిక్షాలో రాజశేఖరం ఇల్లు చేరుకున్నాడు.

మాలతి ఏడుస్తున్నది.

"ఎలా జరిగింది." అడిగాడు ఆమెని.

"చూడండి రావుగారు - నన్ను పిల్లల్ని దిక్కులేనివాళ్ళను చేసి వెళ్ళిపోయారు - " ఏడ్పు ఆపుకుంటూ చెప్పింది." రేపటి నుండి ఏం చెయ్యాలో అర్ధం కావడంలేదు. నెల నెలా జీతం వస్తేనే ఇల్లు గడవటం కష్టంగా వుంది. ఆయనకీ ఈ సంసారం ఈదడం కష్టమైపోయింది. అటువంటి నా మొహాన ఈ ఇద్దరు పిల్లల్ని పడేసి తనదారి తను చూసుకున్నాడు" ఏడ్చేసింది మాలతి.

"రాజశేఖరం ఇలా చేస్తాడనుకోలేదు - చావు ఎలా ముంచుకొచ్చింది?" మత్తు పూర్తిగా దిగిపోయింది. ఆమెను చూడగానే.

"మీ పుణ్యమాని అలవాటయిందిగా తాగుడు - దానికి బానిసై - ఇల్లు - ఒళ్ళు గుల్ల చేసుకొని - చివరికి దానికే బలైపోయారు." ఆమె చెప్పింది.

"జబ్బు చేసిందా" గిల్టీగా ఫీలవుతూ అడిగాడు.

"ఆ! లివర్ పాడైపోయింది. తాగి - తాగి - డబ్బు లేక ఏది దొరికితే అది తాగి లివర్ పూర్తిగా దెబ్బతింది. నిన్న రాత్రి డోసు ఎక్కువైంది - బ్లడ్ వామిటింగ్స్ - నెత్తురు కక్కుని ఆసుపత్రికి తీసుకుపోయేలోగా పోయారు." చెప్పింది ఆమె శోకవదనంతో.

"ప్చ్! చిన్న వయసు ఓ నలభై కూడ నిండలేదు!! పాపం!!' సానుభూతి చూపించాడు.

"దీనికంతా కారణం మీరు - మీరు - నువ్వు! ఆయనకు తాగుడు నేర్పింది నువ్వు! దేముడనేవాడుంటే నీకూ" అదే గతి పడుతుంది. నీ భార్యా నీకు దూరం అవుతుంది. అదే నీకు శాస్తి!" శాపం పెట్టింది కోపంగా.

పానకాలరావు నిలబడలేక వచ్చేశాడు అతని గుండెను గునపంతో గుచ్చిన గుర్తు కొచ్చింది.

ఏడేళ్ళ క్రిందటి గతం గుర్తుకొచ్చింది.

కిశోర్ ఆ రోజు తన మ్యారేజ్ ఫిక్షేషన్ సందర్భంలో పార్టీ యిచ్చాడు అతని స్నేహితులకు.

పానకాలరావు గ్లాసులు ఖాళీ చేస్తువుంటే - ఎదురుగా వున్న రాజశేఖర్ కూల్‌డ్రింక్ తాగుతున్నాడు. అదే అతను పరిచయం కావడం.

"ఏం బ్రదర్? ఒక్క పెగ్గు?" అడిగాడు పానకాలరావు దగ్గరకు పోయి.

"నో థ్యాంక్స్!" చెప్పాడు రాజశేఖర్.

"మీరు టీ టోటులరా?" అడిగాడు.

"ఊ!" ముక్తసరిగా చెప్పాడు.

"ఈ ఒక్కసారికి రుచి చూడండి. " ప్రోత్సహించాడు పానకాలరావు.

"సారీ - నే తాగను." దృఢంగా అన్నాడు రాజశేఖర్.

"ఏం భయమా?" వ్యంగ్యంగా అడిగాడు రావు.

"ఆ! ఆరోగ్యం చెడిపోతుందని భయం - "

"ఎప్పుడైనా ఓసారి సిప్ చేస్తే మంచిదేగాని - తాగుడుకు అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతింటుంది. బై ది బై మీకు అలవాటవుతుందని భయమా?"

"అలవాటా - అది మన చేతిలో వుంటుంది. నాకు విల్ పవర్ వుంది. ఏదీ అలవాటు చేసుకోను." దృఢంగా చెప్పాడు రాజశేఖర్.

మరి తాగచ్చు ఈ ఒక్కసారికి కంపెనీకోసం - " ఛాలెంజ్ చేశాడు రావు. "తాగి మానెయ్యాలి అదీ మొగతనం."

చాలాసేపు వారిద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. కిషోర్ కలుగచేసుకునేసరికి సర్దుకున్నారు.

రావు ఛాలెంజ్ రాజశేఖరం గుండెల్లో గుచ్చుకుని - బలవంతంగా ఓ పెగ్ తాగాడు. అయినా రావు వదల్లేదు.

"ఒక్క పెగ్‌కేం తెలుస్తుంది - మజా - నాలాగా కనీసం రెండు గ్లాసులన్నా తీసుకుని - స్వర్గం అనుభవించి మానెయ్యాలి - అదే గొప్ప." కవ్వించాడు.

రాజశేఖర్ బలహీనత అది. ఎవరైనా ఛాలెంజ్ చేస్తే - ఊరుకోలేడు. అతను చెప్పినట్లే మూడు గ్లాసులు గటగటా తాగేశాడు.

ఓ వారం గడిచిన తర్వాత పానకాలరావు రాజశేఖర్ ఆఫీసుకు వెళ్ళాడు వెతుక్కుంటూ.

"హలో! బ్రదర్ - కంగ్రాట్స్ - మన ఛాలెంజ్‌లో మీరే గెల్చారు - ఈ వారం రోజులుగా ఒక్క పెగ్గు కూడ ముట్టుకోలేదటగా - " అభినందించాడు రావు.

"దటీజ్ రాజశేఖర్! ఏదైనా చేస్తాడు - దేన్నైనా కంట్రోల్‌లో పెట్టుకుంటాడు. విల్‌పవర్ ఉన్న మొనగాడు - " ఉబ్బిపోయి అన్నాడు.

"మీరు బెట్ కలిసిన శుభసందర్భంలో స్టార్ హోటల్లో పార్టీ యిద్దామని వచ్చాను - రావాలి." ఆహ్వానించాడు.

"నాకు ఇవన్నీ గిట్టవు. జస్టు ఏదో మాట పట్టింపు కోసం నిలబడ్డా - అంటే - మీనుండి ఏదో ఆశించి కాదు." రాజశేఖరం తప్పుకోబోయాడు.

"నోనో! మీరు నా పార్టీ స్వీకరించకపోతే నాకు మనశ్శాంతి ఉండదు. మీలా విల్‌పవర్ ఉన్నవాడ్ని చూడ్డం ఇదే మొదటిసారి. మీతో స్నేహం పెంచుకోవాలనుంది - అఫ్‌కోర్స్ - తాగమని మిమ్మల్ని బలవంతం చెయ్యను కూడ." పొగిడేశాడు అతన్ని.

"బలవంతం చేసినా నేను తాగనుగా" రాజశేఖర్ అన్నాడు.

"దెన్ కమాన్ లెటజ్ సెలబ్రేట్! ఐ లైక్ యూ!" పానకాలరావు పాచిక విసిరాడు.

రాజశేఖరం పడిపోయాడు అతని వలలో.

ఆ రాత్రి పార్టీ అయింత తర్వాత పూర్తిగా అదుపు తప్పిన రాజశేఖరాన్ని ఆటోలో తీసుకునివచ్చి మాలతికి అప్పగించాడు పానకాలరావు.

"రేయ్ బ్రదరూ! ఇది నా పెళ్ళాం - మాలతి - అంటే నీకు మరదలు. వాళ్ళు నా పుత్రరత్నాలు - నమస్కారం చెప్పండి - అందరూ." రాజశేఖరం తూలి పడిపోయాడు.

మాలతి ఆందోళన చెందుతూ అతని సరిగా పడుకోబెట్టింది. దేవుడు లాంటి తన భర్త తాగి రావడమేమిటో అర్థం కాలేదు ఆమెకు. వారి పదేళ్ళ దాంపత్యంలో ఇటువంటి దుస్సంఘటనలు జరుగలేదు.

"మాలతిగారు - మీరేం ఖంగారు పడమాకండి - బ్రదరుకు కొంచెం డోసు ఎక్కువైంది అంతే!" చెప్పాడు.

"అసలు ఆయన తాగడమేమిటండి - తాగుడంటేనే అసహ్యించుకునేవాళ్ళు." మాలతి వాపోయింది.

"అదే - అందుకోసమే - అసలు ఈ పిచ్చి వెధవలు ఎందుకోసం తాగుతున్నారో కనుక్కుందామని తాగాడు. ఇంకెప్పుడూ సారా తాగద్దురా అని పదిమంది తాగుబోతులకు చెబుతామని తాగాడు. నేవస్తాను - మా ఆవిడ మీలాగే ఎదురుచూస్తూ వుంటుంది - పతివ్రత." తూలుకుంటూ వెళ్ళిపోయాడు.

ఆ తరువాత రాజశేఖర్ పానకాలరావును వెతుక్కుంటూ వచ్చేవాడు మందు పుచ్చుకుందామని.

ఒకసంవత్సరం తిరిగేసరికి రాజశేఖరం పక్కతాగుబోతు అయిపోయాడు. మందు పుచ్చుకోకుండా ఉండలేని స్థితి కొచ్చేశాడు.

బ్యాంక్ బాలెన్సు తరిగిపోయింది.

అప్పులు పెరిగి పోతున్నాయి.

ఆరోగ్యం క్షీణించనారంభించింది. కళ్ళు పీక్కుపోతున్నాయి. నరాలు బలహీనమైపోతున్నాయి. చేతులు - కాళ్ళు సన్నగా వణకడం మొదలెట్టాయి.

అన్యోన్యంగా ఉండే దాంపత్యంలో తిట్లూశాపనార్థాలు - కొట్లాటలు - మామూలైపోయాయి.

పానకాలరావుకు రాజశేఖర్ తనతో తాగినప్పుడు బిల్లు కట్టాల్సిన పరిస్థితి ఎదురైంది. మొదట్లో రాజశేఖర్ పెట్టుకునేవాడు. కానీ, రోజురోజుక ఆర్థికంగా చిక్కిపోయి అందిన వాళ్ళతో బిల్లు చెల్లించుకోవడం మొదలెట్టాడు. అలా పానకాలరావు నెత్తిన కూడ చాలా పెద్ద మొత్తంలో బిల్లు పడటం మొదలైంది.

పానకాలరావు దూరం కాదల్చుకున్నాడు.

ఓరోజు పార్టీకి పిల్చి - బిల్లు ఇవ్వకుండా జారుకున్నాడు చేతులు కడుక్కొస్తానని చెప్పి.

బిల్లు రెండు వందలపైన అయింది. రాజశేఖర్ జేబులో బిల్లు పైసాలేదు.

బేరర్ వచ్చి బిల్లు కట్టమన్నాడు. అది ఒకకొత్త బార్. దాంలో ఎవరూ అతనికి పరిచయం లేరు.

తనగురించి ఎంత చెప్పుకున్నా ఫలితం లేకుండాపోయింది. ప్యాంటు, చొక్కా తాకట్టు పెట్టేసి రిక్షాలో ఇల్లు చేరుకున్నాడు.

చూసినవాళ్ళంతా ముక్కు మీద వేలేసుకున్నారు.

పదిమందిలో ఇది తెలిసి మాలతికి తలకొట్టేసినట్లయింది.

మరునాడు పానకాలరావు మీద రాజశేఖరం చెయ్యి చేసుకున్నాడు మాటమాట పెరిగి. అప్పటినుండి ఒకరి ముఖం ఒకరు చూసుకోవడం మానేశారు.

సాధ్యమైనంత వరకు వేరే వేరే బార్లు వెళ్ళేవాళ్ళు. ఎదురుపడ్డా పలకరించుకునేవారు కాదు.

ఇది జరిగి మూడు సంవత్సరాలు దాటిపోయింది. ఈ రోజు రాజశేఖరం ఇల్లుకు పోయి - మాలతిని చూడాల్సి వచ్చింది.

మనసు చిత్రసింసలు పెడుతూంటే ఇంటిదగ్గరే వున్న ఇంకో బార్‌లో ఇంకోరెండు పెగ్గులు కొట్టి ఇల్లు చేరుకున్నాడు.

ఇంట్లో సుమతి ఎదురుచూస్తున్నది.

"హూ! వచ్చారా! ఇప్పటికి ఇల్లు కనపడిందా- మీ కోసం చాలా చోట్ల కబురుచేశాను."

"ఎందుకు - బయటకు పోయినవాడు ఇంటికిరాకుండా ఉంటాడా?" విసుగ్గా అన్నాడు.

"మా అమ్మమ్మకు సీరియస్‌గా వుందని టెలిగ్రాం వచ్చింది. చేతిలో పైసా లేదు - నేను అర్జెంటుగా చీరాల పోవాలి. - కనీసం మూడొందలు కావాలి." దీనంగా చెప్పింది సుమతి.

"నా దగ్గర పైసాలేదు -" ఖచ్చితంగా అన్నాడు.

"అలాగంటే ఎలాగండి - చిన్నప్పటినుండి మమ్మల్ని పెంచి పెద్దచేసిన అమ్మమ్మ, పెద్దది - ఎక్కువకాలం బ్రతుకదు - చివరి చూపుకన్నా నేను పోవాలి. రేపుదయం బయలదేరుతాను - మీరు మూడొందలు నాకివ్వాలి." బ్రతిమాలుతూ చెప్పింది.

"ఇక్కడ డబ్బులు మూట కట్టుకుని కూర్చున్నాననుకున్నావా? నువ్వు ఎప్పుడు పడితే అప్పుడు పుట్టింటికి పోతే డబ్బులివ్వడానికి - చచ్చేవాళ్ళని ఎవరు ఆపుతారు - నువ్వు పోయినంత మాత్రాన ఆమె బ్రతకదా" నిర్లక్ష్యంగా అన్నాడు పానకాలరావు.

"హూ! మీ తాగుడుకు ఎంత డబ్బైనా ఉంటుంది. ఒక్కసారి తాగితే వందపైన తగలేస్తారు - కానీ, ఇలా నాకు అవసరం వస్తే మాత్రం మీ దగ్గర పైసా వుండదు." కోపంగా అంది సుమతి.

"నోర్మూయ్! కుక్కినపేనులా పడివుండు - సంపాదిస్తున్నాను ఖర్చుపెడుతున్నాను - అదీ తప్పే!"

"ఖర్చుపెట్టడం తప్పుకాదండి - తాగుడుకు ఖర్చుపెట్టి అటు ఇల్లు- ఇటు ఒళ్ళు గుల్ల చేసుకుంటున్నారే అదీ తప్పండి - "

"షటప్! ఇంకో మాట ఎక్కువ మాట్లాడకు - "

"పోన్లెండి - నాకెందుకు - నేను రేపు ఉదయం ఊరికెళ్ళాలి - నాకు మూడొందలు కావాలి."

"అరే! నా దగ్గర లేవంటే అర్థం కాదూ నీకు."

"డబ్బులుండే మీరు జల్సా చేస్తున్నారా? డబ్బులు లేవని మీ అవసరం ఏది మానుకున్నారు. నేను ఎన్నో అవసరాలు మానుకున్నానండి - ఏనాడూ చీరకొనిమ్మని అడగలేదు - పుట్టింటికి పోతానని పీడించలేదు - అక్కడ అమ్మలాంటి అమ్మమ్మకు అపాయంగా వుందని అర్థిస్తున్నానండి " ఏడ్పు ఆపుకుంటూ చెప్పింది.

"సుమతీ! నీకు మతిపోయింది. నాకు నిద్రొస్తున్నది రేపు ఆలోచిద్దాం - "

"రేపు ఉదయమే బస్సుండి. అది తప్పితే రాత్రికే - మీరు లేచేసరికే తొమ్మిదవుతుది - ప్లీజ్ - నా గురించి కాస్త ఆలోచించండి." అంటూ అతని చేతులు పట్టుకుంది.

నిషాలోవున్న పానకాలరావుకు కోపం నషాళానికంటింది.

ఆమెను వీపు వంచి ఓ గుద్దుగుద్దాడు జడ గుంచాడు. చెంపమీద పెడా పెడా మనికొట్టాడు.

సుమతి ఏడుస్తూ మౌనంగా ఉండిపోయింది.

కానీ, పదేళ్ళ పసివాడైన రాజు తన తల్లికి అన్యాయం జరగడం చూడలేకపోయాడు. అడ్డుపోయాడు.

"నాన్న! అమ్మనెందుకు కొడతావు. నువ్వు మంచివాడివికాదు. ఒట్టి తాగుబోతువి." అంటూ తల్లికి తండ్రికి మధ్య అడ్డుగా నిలిచాడు.

మైకంలో విచక్షణా జ్ఞానంకోల్పోయాడు పానకాలరావు.

ఆవేశంగా కొడుకు రాజును రెండు చేతులతో ఎత్తి దూరంగా విసిరేశాడు.

అంతే!

అమ్మా! అని అరుస్తూ కుప్పకూలిపోయాడు రాజు. వాడి తల వెళ్ళి బలంగా తలుపు కొట్టుకుంది. ప్రాణాంతకం దెబ్బ తగిలినట్టుంది - చూస్తుండగానే కాళ్ళు చేతులు కొట్టుకుని కళ్ళు తేలవేశాడు.

పానకాలరావు పిచ్చివాడిలా రోడ్డుమీదకు పారిపోయాడు.

సుమతికి కళ్ళెంబడి నీళ్ళు ధారగా కారిపోయాయి.

"రాజూ! అంటూ పరిగెత్తుకుంటూ వెళ్ళి వాడ్ని వళ్ళో పడుకోబెట్టుకుంది.

గొడవకు చుట్టుపక్కలవాళ్ళు చేరారు. కొందరు రాజు నాడి చూసి పెదవి చప్పరించారు.

ఎప్పుడో అతని ప్రాణం గాల్లో కలిసిపోయింది.

సుమతి పోలీసు కంప్లయింట్ యిచ్చింది.

పసిపిల్లవాడు రాజు చిరునవ్వు పదేపదే గుర్తుకొస్తున్నది.

వాడికి తను జన్మనిచ్చింది. కానీ, ఏనాడూ వాడి అచ్చటాముచ్చటా తీర్చలేదు. కారణం పానకాలరావు పట్టించుకోకపోవడం - వాడికనీస కోరికలు కూడా తీర్చలేకపోయింది.

ఆఖరికి తన మూలంగా వాడికి ఆయువు మూడింది.

అందుకే కరుడు గట్టిన క్రోధంతో గుండె దిటువు చేసుకొని మొగుడి మీద పోలీసు కంప్లెయింట్ పెట్టింది.

పారిపోయిన పానకాలరావును పోలీసులు అరెస్టు చేశారు.

కటకటాలచాటునున్న మొగుడ్ని చూసి గుండె చెరువైంది సుమతికి. అంతలోనే

రాజు శవం కళ్ళముందు కదిలింది.

"సుమతీ! నీకు మతిపోయిందా నా మీద కేసు బుక్ చేయిస్తావా?" జాలిగా అడిగాడు.

"ఛీ! కన్నకొడుకును చంపుకున్న కసాయి వాడివి! ఆమాట అడగటానికి నీకు సిగ్గుగా లేదు. తాగొద్దని ఎంత చెప్పినా వినకుండా తాగి తాగి – ఒళ్ళు పై తెలీకుండా ప్రవర్తించి పసివాడి ప్రాణం పొట్టన పెట్టుకున్నావు. నీకు ఉరి శిక్ష వేసిన తక్కువే!" రోషంగా కోపంగా అంది.

"అదికాదు సుమతి! తప్పయిపోయింది. ఒళ్ళు తెలీలేదు. బిడ్డపోతే యింకో బిడ్డను కనచ్చు. కానీ, నేను కట్టిన తాళి తెగిపోతే నీకు మొగుడుండే! నీ తాళి కోసమన్నా – నాపై ఉన్న కేసులు విత్‌డ్రాచేసుకో." బ్రతిమాలాడాడు.

"హూ! తాళి! నా బ్రతుక్కు ఎగతాళిగా మారిన ఈ తాళిని అమ్మే రాజు అంతిమ సంస్కారం చేయిస్తున్నాను. ఈ తాళి కట్టే కదా నన్ను ఇన్నాళ్ళు బంధించావు – అది లేదు ఇప్పుడ." ఆవేశంగా అంది.

"సుమతీ! నా మాట విను! నేను జైలులో వుంటే నా ఉద్యోగం ఏమవుతుంది. నన్ను సస్పెండు చేస్తారు. నా ఉద్యోగం ఊడిపోతుంది. తినడానికి తిండైనా వుండ దే – కనీసం పాపకోసమన్నా తెలివిగా ప్రవర్తించవే!" ప్రాధేయపడ్డాడు.

"ఛీ! ఇంకా నీ మాయ మాటలు నమ్ముతాననుకున్నావా? నీ దగ్గర వుంటే పాపగతి కూడ ఇంతే. అందుకే నేనొక నిర్ణయానికొచ్చాను." దృఢంగా అంది సుమతి.

"ఏమిటది? పుట్టింటికి పోతావా? ముందు నా సంగతి చూడు." జాలిగా అన్నాడు.

"విడాకులు యిస్తున్నాను. హంతకుడు – తాగుబోతు – జూదరి – తిరుగుబోతు – నయవంచకుడు నా మొగుడుగా వుండటానికి యింక ఎంతమాత్రం సహించను. గుడ్ బై!"

"ఒసేయ్ సుమతీ! మొగుడ్ని వదిలేసిన ఆడదానికి ఈ సమాజంలో విలువలేదే! నీ బ్రతుకు బజార్న పడుతుంది." నీతులు వల్లించాడు.

"చూడు మిష్టర్ పానకాలరావు, నీ ఇంట్లో యిప్పుడు పొందిన గౌరవం కంటే యింకా ఎక్కువ గౌరవంగా నే బతుకుతాం. స్త్రీ శక్తి ఏమిటో చూపిస్తాను. ఆడది తలబాగుంటే ఏమైనా చేయగలదని గుణపాఠంగా నిన్ను శిక్షిస్తున్నాను. గుడ్ బై!" తృణీకారంతో అని విసవిసవెళ్ళి పోయింది సుమతి.

రాజమండ్రి సెంట్రల్ జైల్లో రాళ్ళు కొట్టుకుంటూ ప్రస్తుతం బ్రతుకుతున్నాడు పానకాలరావు. గతంలో తాను సారామత్తులో ఎంత నీచంగా ప్రవర్తించింది నెమరువేసుకుంటూ.

కథా నిలయం
5884
శ్రీకాకుళం